క్లుప్తంగా

నేడు శని త్రయోదశి పూజలు

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ రైల్వే ఆవరణలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకుడి ఆలయంలో నేడు శనివారం ఉదయం 7 గంటల నుంచి శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి నరసా రవికుమార్ శర్మ తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

యూనియన్‌లో చేరిక



సీపీఓకు యూనియన్ తరఫున అర్జీ ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ మంగంపేట రిహాబిలిటేషన్, వర్కర్స్ యూనియన్‌లో ఏపీఎండీసీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు శుక్రవారం చేరారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని సీపీఓ సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. ఏపీఎండీసీ మంగంపేట రిహాబిలిటేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తల్లెం రమణారెడ్డి మాట్లాడుతూ ఏపీఎండీసీ పాఠశాల ప్రారంభం నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ యూనియన్‌లో చేరారని, ఇప్పటి వరకు వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని, ఇకపై అందరినీ కలుపుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేసిన దృశ్యం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని మాసాపేటలో శుక్రవారం పేదలకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రంజాన్‌తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత, రోటరీ క్లబ్ జిల్లా అధికారి గాండ్లపెంట ఖాదర్‌బాషా ఆర్థిక సౌజన్యంతో పేద ముస్లింలకు బియ్యం, బెల్లం, కందిపప్పు, సేమియా, చక్కెర, నూనె, ఉప్పు తదితర నిత్యావసరాల కిట్‌ను క్లబ్ సభ్యుల చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ రియాజుద్దీన్, అధ్యక్షుడు సయ్యద్ నిజాముద్దీన్, మాజీ అసిస్టెంట్ గవర్నర్‌లు కృష్ణదేవరాయలు, పి.సురేష్, డాక్టర్ రెడ్డన్న, జిల్లా అధికారి సయ్యద్ అష్రఫ్, మాజీ అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన సిబ్బందికి మజ్జిగ పంపిణీ



ఉపాధ్యాయులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : డైట్, బాలికోన్నత పాఠశాలలో పది పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం నిర్వహిస్తున్న నిపుణులకు, సిబ్బందికి మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేశారు. మూల్యాంకనంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా సబ్జెక్టులకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. వీరికి ఏపీ పీఈటీ, ఎస్‌ఏపీ అన్నమయ్య జిల్లా శాఖ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ బాబు, ప్రసాద్ రావులు మజ్జిగను పంపిణీ చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మూల్యాంకనం చేస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు 1000 మందికి ఈ మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

గాలివీడులో పోలీసు కవాతు



సాయుధ బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

గాలివీడు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ అనంద్ పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు మండలంలో ఎస్ఐ వెంకటప్రసాద్‌తో కలిసి గాలివీడు, నూలివీడు, కొర్లకుంట, అరవీడు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలపై ఎన్నికల విధుల కోసం వచ్చిన కేంద్ర బలగాలకు ఆయా ప్రాంతాలపై అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకే ఈ ప్రదర్శన చేపట్టామన్నారు. ఈ కవాతుతో ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

- సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి
- ఎన్నికల ప్రచారానికి అడుగడుగునా అపూర్వ ఆదరణ
- సి.పాలిమేరపల్లె, బోనమల గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు



ఎన్నికల ప్రచారానికి భారీగా హాజరైన నాయకులు, గ్రామస్తులు



శ్రీకాంత్‌రెడ్డికి కర్పూర హారతులు పడుతున్న మహిళ

చిన్నమండెం : ఆదరించి ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని సి.పాలిమేరపల్లె గ్రామంలో బెస్తపల్లె, కాయలవాండ్లపల్లె, పాలిమేరపల్లెలలోనూ, బోనమల గ్రామంలోని నాగూరివాండ్లపల్లె, బోనమలకస్పా, కనకంటివారిపల్లె, హరిజనవాడ, గొల్లపల్లె, పాలెం నగిరిలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి

శ్రీకాంత్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రతి గడపలో ఆత్మీయ స్వాగతాలు లభించాయి. సంక్షేమం ప్రతి ఇంటికి అందడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యే ఎదుట తమ ఆనందాన్ని తెలియజేశారు. జగనన్న పాలనలో మా ఇంటికి నాలుగు పథకాలు అందాయంటూ చెప్పిన వారు అనేకం ఉన్నారు. తామంతా ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుక నడిచి తమ రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యేకు చెప్పారు. అలానే బీసీ కాలనీలో సాగిన ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం బీసీలకు అందించిన రాజకీయ ప్రాధాన్యతను గుర్తు చేశారు. ఏ ప్రభుత్వంలో తమకు గుర్తింపు రాలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు అన్ని విధాలా అండగా నిలిచారని ఆయా గ్రామాల్లోని బెస్త, వడ్డెర కులస్తులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిల ఎదుట హర్షం వ్యక్తం చేశారు. బోనమల గ్రామంలో ముస్లిం మైనార్టీలు ఘన స్వాగతాలు పలికారు. పాలెం హరిజనవాడలో నాయకులకు దళిత మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఏకిల కులస్తులను బీసీలో చేర్చిన ఘనత వైఎస్ఆర్‌దేనని పాలెంనగిరి, గొల్లపల్లెలలోని ఏకిల కుటుంబాలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, సర్పంచులు లోకేశ్వరరెడ్డి, అఫ్రోజ్, మండల నాయకులు బాబురెడ్డి, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్, ఎంపీటీసీ రమేష్, నరసయ్యస్వామి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, నాగేశారెడ్డి, మాజీ సర్పంచ్ అమ్మాజీ, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, వైసీపీ నాయకులు జేసీబీ శేఖర్, మురళి, వెంకటేశ్వర్లు, నారాయణ, శివయ్య, శ్రీపతి గుర్రయ్య, పవన్, గురుదేవ, రామ్మోహన్, చంద్రారెడ్డి, రాజు, సాయిశ్రీనాథ్, లోకనాథ, మల్లికార్జున, క్రిష్ణ, ఆనంద్, జయశంకర్‌రెడ్డి, చెన్నకేశవ, జాబీద్, సిబకతుల్లా, ఖాయం, అజ్రు, యహియాఖాన్, రమేష్, చంద్రారెడ్డి, రామచంద్ర, సురేంద్రరెడ్డి, జయశంకర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న ఇంటాక్ ఉగాది వేడుకలు

కడప కల్చరల్: భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈ నెల 9వ తేదీ ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో గల మానస ఇన్ సమావేశ మందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఇంటాక్, అనుబంధ సంస్థలైన లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగా ఉగాది పంచాంగ పఠనం, కవి సమ్మేళనంతోపాటు 12 సంవత్సరాలలోపు చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీ నిర్వహించి బహుమతులు అందిస్తామని తెలిపారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పణ

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీ గుంటి గంగమ్మ జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి బోణాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చాందినీబండ్లు, అన్నదానం బండ్లు, పానకం బండ్లు ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకుందాం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఓబన్న

సిద్దవటం : రానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకుందామని సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న పిలుపునిచ్చారు. సిద్దవటం మండలంలోని వెంకటయాపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ప్రజలకు ఎన్నికల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరి ఓటు వారు వేసుకొని వారి గృహాలకు వెళ్లాలన్నారు. అలాకాకుండా గ్రామంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత ఘర్షణకు దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న విప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లె హరిజనవాడలో శుక్రవారం రాములస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన రామాలయాలు నిర్మించడం ఎంతో సంతోషకరం అన్నారు. భక్తిభావంతో ప్రతి ఒక్కరూ మెలగాలన్నారు. శ్రీరామచంద్రున్ని ఆదర్శంగా తీసుకుని పేదప్రజలకు సేవలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, తనకు ఆ దేవుని ఆశీస్సులతోపాటు ప్రజల ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఆర్‌సి.సురేష్‌బాబు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, సూరి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రాజంపేటలో ప్రైవేట్ వైద్యుడిగా ప్రాక్టిస్ చేస్తున్న చాపల వెంకటరెడ్డి గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం పెనగలూరులోని సాతుపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట పంజం సుకుమార్ రెడ్డి, రెడ్డివారి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి భద్రకాళికి హారతులు పట్టారు. రాహుకాల పూజ విశేషాలను ప్రధాన అర్చకులు వివరించారు.

పొత్తు పార్టీలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి

- టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుపై ఓటర్లు అప్రమత్తం కావాలి
- ముస్లింలకు జరిగే అన్యాయాన్ని వైఎస్సార్‌సీపీ ఎదిరిస్తుంది
- సుండుపల్లె ర్యాలీలో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఆకేపాటిలు



సుండుపల్లె ప్రచార ర్యాలీలో మిథున్‌రెడ్డి, ఆకేపాటిలను గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

సుండుపల్లె(రాజంపేట) : టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుపై ఓటర్లు అప్రమత్తం కావాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లెలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పొత్తు పార్టీలను దరి చేరనీయకుండా తరిమికొట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముస్లిం మైనార్టీలకు ఉన్నా 4 శాతం రిజర్వేషన్‌ను తెలంగాణలో తీసేస్తామని బీజేపీ చెబుతోందన్నారు. ఈ విషయాన్ని ముస్లింలు గుర్తుపెట్టుకొని పొత్తు పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని చెప్పారు. ముస్లింలకు జరిగే ఏ అన్యాయం జరుగకుండా వైఎస్సార్‌సీపీ ఎదిరిస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రశాంతత ఉండాలంటే వైఎస్సార్‌సీపీ గెలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తును పోలింగ్ కేంద్రానికి వెళ్లినప్పుడు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒకటి ఎంపీగా నాకు, మరొకటి ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి అమూల్యమైన ఓటు వేసి వేయించి, గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన తిరిగి వస్తేనే పేదలకు సంక్షేమం కొనసాగుతుందన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ ప్రజాపాలన ఐదేళ్లు కొనసాగిందన్నారు. ఈ ఎన్నికల్లో తోడేళ్ల గుంపు ఒక్కటై జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీ చేస్తున్నారన్నాయని, కానీ వైఎస్ జగన్ పైన దేవుడుని, ప్రజలను నమ్ముకున్నాడన్నారు. పేదలే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు అజంతమ్మ, అజయ్‌రెడ్డి, మండల కన్వీనరు రామస్వామిరెడ్డి, ఎంపీ మేనల్లుడు వీరబల్లి మదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనరు రెహమాన్‌ఖాన్, ఆరంరెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, ఎంపీటీసీ నాగేశ్వరనాయుడు, రెడ్డమ్మ, సర్పంచులు రామజయచంద్ర, మైనార్టీ నాయకులు రహింబాషా, కలీంబాషాతోపాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అంతకముందుగా సుండుపల్లెలోని పలు దేవాలయాల్లో మిథున్‌రెడ్డి, ఆకేపాటి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు పల్లెల్లో రోజంతా విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని అగ్రహారం, సుండుపల్లె టౌన్, గుల్లవాండ్లపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, ఎగువ ఈడిగపల్లె, పెద్దమాదిగపల్లెలో పర్యటించారు. ఓటర్లను కలుసుకొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటిల ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముస్లిం మైనార్టీ నేత మహబూబ్‌బాషా

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మైనార్టీ నేత మహబూబ్‌బాషా

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మైనార్టీనేత మేకల మహబూబ్ బాషా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బాషా మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ముస్లింలు మద్దతుగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ బీజేపీతో జత కట్టిందని, ఈ అంశం టీడీపీలో ముస్లిం నేతలను కలవరపాటుకు గురిచేసిందన్నారు.

8న జ్యోతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఈనెల 8 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామచంద్ర తెలిపారు. 8న ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 9న ఉగాది పురస్కరించుకుని జ్యోతి ఉత్సవాలు, 10న ఉట్ల తిరునాల, 11న జ్యోతి ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జాతరలు సంస్కృతికి ప్రతీకలు

బి.కొత్తకోట : జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండకింద కురవపల్లెలో జరిగిన జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక, మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో స్థానిక నాయకత్వంగా బలంగా పనిచేయాలని కోరారు. ఐదేళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు ఉజ్జయిని సాంబశివ, నాయకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



రైల్వేకోడూరు: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రాయచోటి అర్బన్: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ప్రజాసంఘాల నేతలు



సిద్దవటం: బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప

రైల్వేకోడూరు : బాబు జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి అని, దేశం గర్వించదగ్గ నాయకుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని వర్గాల వారు బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. బాబు జగ్జీవన్‌రామ్ ఒక సామాన్యమైన పేద కుటుంబంలో జన్మించి దేశానికే ఉప ప్రధానిగా పని చేసిన వ్యక్తి అన్నారు. ఆయన రైతుల కోసం, కార్మికుల కోసం ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని, ఆ సంస్కరణలు ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతి ఒక్కరూ అన్ని విధాలుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్ బాషా, డైరెక్టర్లు ముజీబ్, సుధాకర్‌రాజులు, పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్, సర్పంచ్ శివయ్య, తుమ్మల సురేష్, పుష్పలత, శ్రీరామ్ వినోద్, డివి.రమణ, నగిరిపాటి వెంకటేష్, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం కమాండెంట్ పి.రవిశంకర్ ఆదేశాల మేరకు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరప్ప మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం చేసిన పోరాటం మరచిపోలేనిదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంటు పి.ఎన్.డి.ప్రసాద్, వి.జయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు ఏఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

బహుజనుల ఆరాధ్యదైవం జగ్జీవన్ రామ్

లక్కిరెడ్డిపల్లె : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, బహుజన ఆరాధ్య దైవం బాబు జగ్జీవన్ రామ్ అని ముదిరాజ్ సంఘం నాయకుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 115వ జయంతి సందర్భంగా శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాలెం మాజీ సర్పంచ్ రామచంద్ర, హరినాథ్, బసయ్య, కొండమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు జగ్జీవన్‌రామ్ కృషి

రాయచోటి అర్బన్ : సమాజంలో అస్పృశ్యత, అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడం ద్వారా సమసమాజం నిర్మాణం కోసం అవసరమైన చట్టాలకు ఊపిరి పోసిన మహనీయుడు బాబు జగ్జీవనరామ్ అని ప్రజా సంఘాల నేతలు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను ప్రజా సంఘాల నేతలు నిర్వహించారు. జగ్జీవరామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ నాయకుడు పి.రెడ్డయ్య, బంజారా హక్కుల సంఘం నేత రెడ్డినాయక్, మాల మహానాడు నేత పామయ్య, దళితగళం నేత నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నేతలు వెంకటరమణ, నారాయణ, సుబ్బయ్య, భద్రి తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రమైన రాయచోటిలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బాబు జగ్జీవనరామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహింపబడ్డాయి. నేతలు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో ఎస్టీయూ ఆధ్వర్యంలో..

రాజంపేట టౌన్ : స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని, ఉపాధ్యాయ ఉద్యమ నేత వీణా విజయ్‌కుమార్‌రాజు వర్ధంతిని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొండూరు రఘునాథరాజు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. వీణావిజయ్‌కుమార్‌రాజు ఎస్టీయూను స్థాపించి ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమించి పరిష్కరించారని తెలిపారు. తొలుత బాబు జగ్జీవన్‌రామ్, విజయ్‌కుమార్‌రాజు చిత్రపటాలకు ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఆదినారాయణరెడ్డి, నరసింహ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషగిరి రావు, సిబ్బంది శుక్రవారం నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని, సమానత్వం కోసం అనేక పోరాటాలు చేశారని తహసీల్దార్ పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి సిబ్బందితో కలిసి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్‌ఓ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సాతుపల్లెలో..

రాజంపేట : పట్టణంలోని సాతుపల్లెలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 116 జయంతి సందర్భంగా ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజరు దండు మణి బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరేపల్లె మురళీధర్, నాయకులు మణి, నగరిపాటి బాబు, సురేంద్రబాబు, రేవూరి తేజ, దీపం విష్ణు, నాని, యల్లయ్య, రెడ్డయ్య, యంబలూరి రమణ, పసుపులేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

9న బిషప్ పట్టాభిషేక మహోత్సవం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాకు చెందిన క్రైస్తవ ప్రముఖులు సగిలి ప్రకాష్ పట్టాభిషేక మహోత్సవం ఈ నెల 9న ఖమ్మంలోని దివ్య కారుణ్య బృహత్ దేవాలయం కరుణగిరి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. ఆరోగ్యమాత చర్చిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం బిషప్‌గా సగిలి ప్రకాష్ వెళ్లిన విషయం తెలిసిందే అన్నారు. 9న ఖమ్మంలో జరిగే ఆయన పట్టాభిషేక మహోత్సవానికి ఫాదర్ ఎండీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో 8న సాయంత్రం కడప, చిత్తూరు, పోరుమామిళ్ల, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు.

8 నుంచి గంగమ్మ జాతర

కడప కల్చరల్: కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా వారం రోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని గోపాల్‌సింగ్ తెలిపారు. 8 నుంచి 7 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 14న మహానైవేద్యం, అన్నదానం, పల్లకీ సేవ, పవళింపు సేవలతో ఉత్సవం ముగుస్తుందన్నారు.